RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:122 | మే 05, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

కేరళలో యూడీఎఫ్ విజయంపై
**రేవంత్ రెడ్డి అభినందనలు**

2లో

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

భారత రాజకీయ ముఖచిత్రంపై మరోసారి కాషాయ జెండా రెపరెపలాడింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ తన తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటూ ప్రభంజనం సృష్టించింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కోటను బద్దలు కొట్టి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేయగా.. అస్సాం, పుదుచ్చేరిల్లోనూ కమల దళం క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు దక్షిణాది రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టీవీకే ఊహించని రీతిలో అతిపెద్ద పార్టీగా అవతరించి సంచలనం సృష్టించగా, కేరళలో ఎల్డీఎఫ్ హవాకు బ్రేక్ వేస్తూ కాంగ్రెస్ భారీ మెజారిటీతో అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అభివృద్ధికి, మార్పుకు పట్టం కట్టిన ఓటర్ల తీర్పుతో దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి.

తమిళనాడు సీఎం
## స్టాలిన్ ఓటమి
టీవీకే అభ్యర్థి చేతిలో
9 వేల ఓట్ల తేడాతో పరాజయం

మమతా బెనర్జీకీ
## తప్పని పరాభవం
15వేల మెజార్టీతో బెంగాల్
సీఎంపై సువేందు విజయం

వివరాలు 2లో..

# మోడీ మ్యాజిక్..!

దేశ రాజకీయాల్లో
బీజేపీ సునామీ..
- అస్సాం, బెంగాల్, పుదుచ్చేరిలో కమల వికాసం..
- తమిళనాట విజయ్ సంచలనం
- కేరళలో కాంగ్రెస్ హవా..

తమిళనాడులో
దళపతి సంచలనం
తొలి ఎన్నికలలోనే విజయ్ పార్టీ చరిత్ర
సంప్రదాయ పార్టీల్లో టీవీకే రాజకీయ భూకంపం

మమత సామ్రాజ్యంపై
కాషాయ జెండా!
15 ఏళ్ల తృణమూల్ పాలనకు బీజేపీ చెక్

కేరళ 'ఎర్రకోట'కు బీటలు
పదేళ్ల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని
యూడీఎఫ్‌కు అధికార పీఠం

| పశ్చిమ బెంగాల్ (294) | | తమిళనాడు (234) | | అస్సాం (126) | | పుదుచ్చేరి (30) | | కేరళ (140) | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| బిజేపీ | 208 (70.75%) | టీవికె | 107 (45.73%) | బీజేపీ+ | 101 (80.16%) | బీజేపీ + | 18 (60.00%) | యూడీఎఫ్ | 89 (63.57%) |
| టీఎంసీ | 79 (26.87%) | డీఎంకే+ | 74 (31.62%) | కాంగ్రెస్+ | 21 (16.67%) | కాంగ్రెస్+ | 6 (20.00%) | ఎల్డీఎఫ్ | 35 (25.00%) |
| కాంగ్రెస్ | 2 (0.68%) | ఏఐడీఎంకే+ | 52 (22.22%) | ఏఐయూడీఎఫ్ | 2 (1.59%) | టీవీకే | 3 (10.00%) | బీజేపీ+ | 3 (2.14%) |
| లెఫ్ట్ పార్టీలు | 2 (0.68%) | ఇతరులు | 1 (0.43%) | ఇతరులు | 2 (1.59%) | ఇతరులు | 3 (10.00%) | ఇతరులు | 13 (9.29%) |
| ఇతరులు | 3 (1.02%) | | | | | | | | |

## రైతుల పరిస్థితి దయనీయం
- మద్దతు ధర, రైతుబంధు ఏమైంది?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సదాశివపేట కొనుగోలు కేంద్రంలో రైతులతో చర్చ

2లో

## భూముల ధరలు పెంపు
- మార్కెట్ విలువల సవరణకు కేబినెట్ ఆమోదం
- వ్యత్యాసాల నివారణకు శాస్త్రీయ పద్ధతులు
- నెలాఖరులో కొత్త ధరలు అమలు

2లో

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

# మోడీ మ్యాజిక్..!

## బీజేపీ అఖండ విజయం ప్రజాస్వామ్యానికి గర్వకారణం

- వంశపారంపర్యం కాదు.. వంద కోట్ల ప్రజల విశ్వాసం
- కుట్రల రాజకీయాలకు ముగింపు..
- కాంగ్రెస్, టీఎంసీ కూటమికి గట్టి దెబ్బ
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్‌లో ఘనంగా విజయోత్సవాలు

**వేద న్యూస్, వరంగల్**

నేడు విడుదలైన ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన అఖండ విజయం ప్రజాస్వామ్యానికి గర్వకారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు బాంబులు పేల్చి, మిఠాయిలు పంచుతూ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా సాగుతున్న అభివృద్ధి పాలనకు ప్రజలు మద్దతు తెలిపారని తెలిపారు. దేశ ప్రజలు కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి వైపు నిలిచారని, పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. ఈ విజయానికి కృషి చేసిన పార్టీ కార్యకర్తల శ్రమ అమూల్యమని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలికి ప్రజలు మార్పుకు మద్దతు ఇచ్చారని తెలిపారు. 'సోనార్ బంగ్లా' లక్ష్యంగా అభివృద్ధి, భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, రత్నం సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్ తదితరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల పరిస్థితి దయనీయం

### మద్దతు ధర, రైతుబంధు ఏమైంది? బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### సదాశివపేట కొనుగోలు కేంద్రంలో రైతులతో చర్చ

**వేద న్యూస్, సంగారెడ్డి**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పంటలను కొనక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు సమయానికి అందడం లేదని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు సమయానికి రైతుబంధు అందించామని, పంటల కొనుగోలులో ఎలాంటి ఆంక్షలు లేకుండా సహాయం చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి, జొన్నలు, శనగలకు మద్దతు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతుల పంటలను వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ, రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అవసరమైతే నిరసనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కేరళ విజయంపై రేవంత్ రెడ్డి అభినందనలు

**వేద న్యూస్, హైదరాబాద్**

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, కూటమి సాధించిన విజయం అసాధారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసి వేణుగోపాల్, దీపాదాస్ మున్షీల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను కేరళలో ప్రచారంలో పాల్గొన్న సమయంలో అక్కడి ప్రజలు చూపిన ఆదరణను గుర్తు చేసుకున్న ఆయన, యూడీఎఫ్ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి బలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు అభివృద్ధిని విశ్వసిస్తాయని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించడంతో కొత్త భవిష్యత్తుకు నాంది పలికారని అన్నారు. ఇదే విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. యూడీఎఫ్‌కు కేరళ ప్రజలు ఇచ్చిన మద్దతు ఆనందదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ కూడా స్పందిస్తూ ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన అందించాలనే సంకల్పానికి ఈ విజయం బలాన్నిచ్చిందని అభిప్రాయపడ్డారు.

## భూముల ధరలు పెంపు

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల్లో ఉన్న వ్యత్యాసాలను దృష్టిలో ఉంచుకుని ధరలను శాస్త్రీయంగా సవరించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రాంతాలవారీగా భూముల ధరల్లో ఉన్న అసమానతలు, రిజిస్ట్రేషన్ విలువలు మరియు వాస్తవ మార్కెట్ ధరల మధ్య ఉన్న తేడాలను సరిచేయడానికి సమగ్ర అధ్యయనం చేపట్టాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా రిజిస్ట్రేషన్ శాఖకు మార్గదర్శకాలు జారీ చేసి, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా కొత్త మార్కెట్ విలువలను ఖరారు చేయనున్నారు. ఈ నెల చివరి వారంలో సవరించిన ధరలను అమల్లోకి తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ సవరణలతో భూముల లావాదేవీల్లో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే భూములు కోల్పోతున్న నిర్వాసితులకు తగిన పరిహారం అందేలా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంది.

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

దేశ రాజకీయ యవనికపై భారతీయ జనతా పార్టీ తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించగా, ఓటర్లు అభివృద్ధికి, మార్పుకు పట్టం కట్టారు. ప్రధానంగా అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కమల దళం క్లీన్ స్వీప్ చేయగా, కేరళలో కాంగ్రెస్, తమిళనాడులో కొత్త పార్టీ టీవీకే తమ సత్తా చాటాయి.

### బెంగాల్ గడ్డపై ఎగిరిన కాషాయ జెండా

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్‌పై బీజేపీ తన పట్టు సాధించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను బద్దలు కొడుతూ.. మొత్తం 294 స్థానాల్లో 208 సీట్లు గెలుచుకుని బీజేపీ ఘన విజయం సాధించింది. తృణమూల్ కేవలం 79 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ 2 సీట్లతో సరిపెట్టుకుంది. బెంగాల్ రాజకీయాల్లో ఇది ఒక పెను మార్పుగా రాజకీయ పండితులు అభివర్ణిస్తున్నారు.

### అస్సాంలో హిమంత మార్క్..

అస్సాం రాష్ట్రంలో ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ నేతృత్వంలో బీజేపీ సరికొత్త చరిత్రను లిఖించింది. మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 101 సీట్లను కైవసం చేసుకుని ప్రతిపక్షాలను నామరూపాలు లేకుండా చేసింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అభివృద్ధి పథకాలే ఈ విజయానికి నాంది పలికాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కేవలం 21 స్థానాలకే పరిమితం కాగా, ఇతరులు 4 చోట్ల విజయం సాధించారు.

### పుదుచ్చేరిలోనూ కమల వికాసం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా బీజేపీ తన హవాను కొనసాగించింది. మొత్తం 30 స్థానాల్లో 18 సీట్లు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకుంది. మోదీ నాయకత్వంపై నమ్మకం, స్థిరమైన పాలన కోరుకున్న ఓటర్లు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు. అభివృద్ధి మంత్రమే ఇక్కడ కమల దళాన్ని గెలిపించింది.

### తమిళనాట విజయ్ సంచలనం.. టీవీకే హవా

తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఊహించని రీతిలో సంచలనం సృష్టించింది. సంప్రదాయ పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకేలకు గట్టి పోటీనిస్తూ.. మొత్తం 234 స్థానాల్లో టీవీకే ఏకంగా 107 సీట్లు గెలుచుకుని అతిపెద్ద రాజకీయ శక్తిగా అవతరించింది. డీఎంకే 74 అన్నా డీఎంకే 52 స్థానాలతో రెండో స్థానంలో నిలవగా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది.

### కేరళలో హస్తం దూకుడు.. అధికార మార్పిడి

దక్షిణాది రాష్ట్రమైన కేరళలో ఈసారి ఓటర్లు మార్పు కోరుకున్నారు. గత అధికార కూటమి ఎల్డీఎఫ్‌ను కాదని, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమికి పట్టం కట్టారు. మొత్తం 140 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 98 సీట్లతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఎల్డీఎఫ్ 35 స్థానాలకు పడిపోగా, బీజేపీ కేవలం 3 స్థానాల్లో మాత్రమే విజయం సాధించి తన ఉనికిని చాటుకుంది.

## తొలి సమరంలోనే దళపతి ప్రభంజనం!

### ద్రవిడ రాజకీయాల్లో కొత్త శకం.. సంప్రదాయ పార్టీలకు గట్టి షాక్

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. వెండితెరపై తన నటనతో కోట్లాది మందిని అలరించిన స్టార్ హీరో విజయ్, ఇప్పుడు రాజకీయ రంగస్థలంపై అసలైన 'బ్లాక్ బస్టర్' విజయాన్ని అందుకున్నారు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 'విజిల్' గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగి, తొలి ప్రయత్నంలోనే ప్రభంజనం సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా 107కు స్థానాలను కైవసం చేసుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడంతో, ద్రవిడ రాజకీయాల ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. విజయ్ సాధించిన ఈ విజయం దక్షిణాది దిగ్గజాలు ఎన్‌టీఆర్, ఎంజీఆర్‌ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేస్తోంది. గతంలో అనేకమంది సినీ తారలు రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, మొదటి ఎన్నికల్లోనే ఈ స్థాయి మెజారిటీని సొంతం చేసుకున్న దాఖలాలు అరుదు. విజయ్‌కాంత్, చిరంజీవి, పవన్ కల్యాణ్ వంటి నేతలు భారీ ప్రజాదరణ పొందినప్పటికీ, అధికారాన్ని అందుకునే స్థాయికి చేరుకోలేకపోయారు. కానీ విజయ్ మాత్రం తనదైన వ్యూహంతో అతి తక్కువ సమయంలోనే పార్టీని గ్రామ స్థాయికి తీసుకెళ్లి, ఓటర్ల మద్దతును గెలుచుకున్నారు. 2024లో పార్టీని ప్రకటించిన నాటి నుంచి నేటి ఫలితాల వరకు ఆయన వేసిన ప్రతి అడుగు అత్యంత పక్కాగా సాగింది. ముఖ్యంగా, సంప్రదాయ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా టీవీకే ఎదగడం ఇక్కడ గమనార్హం. దశాబ్దాలుగా ఈ రెండు పార్టీల మధ్యే సాగుతున్న అధికార మార్పిడికి విజయ్ గట్టి సవాల్ విసిరారు. ఎలాంటి కూటమి లేకుండా, పూర్తిగా ఒంటరిగా 234 స్థానాల్లో పోటీ చేయాలనే ఆయన నిర్ణయం అప్పట్లో సాహసంగా అనిపించినా, ఫలితాల్లో మాత్రం అది అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చింది. ఓట్ల చీలికకు తావులేకుండా, మార్పు కోరుకునే యువత, మధ్యతరగతి వర్గాలు

విజయ్ వైపు మొగ్గు చూపారు. సోషల్ మీడియా మరియు తనకున్న భారీ అభిమాన సంఘాలను బూత్ స్థాయి కార్యకర్తలుగా మార్చడంలో విజయ్ టీమ్ విజయవంతమైంది. విజయ్ తన ప్రచారంలో ఎంజీఆర్ బాటను అనుసరిస్తూనే, ప్రస్తుత కాలానికి అనుగుణంగా పారదర్శక పాలన మరియు అవినీతి రహిత రాజకీయాల వాగ్దానం చేశారు. ఈ నినాదాలే ఆయనను ముఖ్యమంత్రి పీఠానికి చేరువ చేశాయి. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం, తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది విజయేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయం కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, దేశ రాజకీయాల్లో సినీ గ్లామర్‌ను ఓట్లుగా మలచుకోవడంలో ఒక కొత్త 'సక్సెస్ ఫార్ములా'గా నిలవనుంది. మొత్తానికి, సంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలుకుతూ తమిళ ప్రజలు విజయ్ నాయకత్వంలో కొత్త ప్రయాణానికి నాంది పలికారు.

### బెంగాల్ గడ్డపై కమల వికాసం..

## దీదీ కోటలో బీజేపీ సునామీ!

### 15 ఏళ్ల టీఎంసీ ఆధిపత్యానికి బ్రేక్

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దన్నర కాలం తర్వాత ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. 15 ఏళ్ల పాటు అఖండ ఆధిపత్యంతో రాష్ట్రాన్ని ఏలిన తృణమూల్ కాంగ్రెస్‌కు చెక్ పెడుతూ, బీజేపీ ఘన విజయం సాధించింది. 'మా, మాటీ, మానుష్' నినాదంతో అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన తీవ్ర వ్యతిరేకత ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించింది. 2021లో స్వల్ప దూరంలో చేజారిన అవకాశాన్ని 2026లో భారీ మెజారిటీతో అందిపుచ్చుకున్న కాషాయ దళం, బెంగాల్ గడ్డపై కొత్త రాజకీయ అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఈ అద్భుత విజయానికి ప్రధానంగా టీఎంసీ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం నుంచి రేషన్ పంపిణీ లోపాల వరకు వరుసగా వెలుగులోకి వచ్చిన అక్రమాలు, కీలక నేతల ఇళ్లలో భారీగా నగదు స్వాధీనం కావడం వంటి ఘటనలు మధ్యతరగతి మరియు చదువుకున్న వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. దీనికి తోడు మహిళా భద్రత అంశం కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించింది. సందేశ్‌ఖాలీ ఘటనలతో పాటు కోల్‌కతా ఆర్.జి.కర్ ఆసుపత్రి ఉదంతంపై ప్రభుత్వ ఉదాసీన వైఖరి మహిళా ఓటర్లను మమతా బెనర్జీకి దూరం చేసింది. మరోవైపు, హిందూ ఓటు బ్యాంక్ ఏకీకరణ మరియు సీఏఏ అమలు వంటి అంశాలు బీజేపీకి రాజకీయంగా భారీ లాభాన్ని చేకూర్చాయి. మతువా సమాజం మరియు శరణార్థులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేయగా, వామపక్షాలు మరియు కాంగ్రెస్ బలహీనపడటంతో టీఎంసీ వ్యతిరేక ఓట్లన్నీ ఏకపక్షంగా బీజేపీ ఖాతాలోకి చేరాయి. ప్రధాని నరేంద్ర మోదీ 'డబుల్ ఇంజిన్' నినాదం మరియు క్షేత్రస్థాయిలో సువేందు అధికారి రచించిన వ్యూహాలు పార్టీని విజయతీరాలకు చేర్చాయి. మొత్తం మీద, బెంగాల్ ప్రజలు అభివృద్ధి మరియు మార్పు కోరుకుంటూ కాషాయ జెండాకు జై కొట్టారు.

## తమిళనాడు సీఎం స్టాలిన్ ఓటమి!

- టీవీకే అభ్యర్థి చేతిలో 9 వేల ఓట్ల తేడాతో పరాజయం
- 1996 తర్వాత స్టాలిన్‌కు తొలి ఎదురుదెబ్బ

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన ఫలితం నమోదైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కొళత్తూరు నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో సుమారు 9 వేల ఓట్ల తేడాతో పరాజయం చెందారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన స్టాలిన్ ఈసారి విజయం సాధించలేకపోవడం గమనార్హం. 1996 తర్వాత ఆయన ఓడిపోవడం ఇదే తొలిసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే పార్టీ గెలుపు దిశగా దూసుకుపోతోంది. ఇదే సమయంలో స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం తన నియోజకవర్గంలో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత పన్నీర్ సెల్వం బోడినాయకనూర్ నియోజకవర్గంలో ముందంజలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఓటమి ఖాయం కావడంతో చెన్నైలోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంబరాల టెంట్లను తొలగించారు.

## కేరళలో 'హస్తం' హవా..

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

కేరళ రాజకీయాల్లో సంప్రదాయం మళ్లీ పునరావృతమైంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని ఆశించిన ఎల్‌డీఎఫ్ కూటమికి ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి ప్రజలు పట్టం కట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల విజయాలతో మంచి ఊపు మీద ఉన్న యూడీఎఫ్, అసెంబ్లీ సమరంలో 89 స్థానాలను గైవసం చేసుకుని మ్యాజిక్ ఫిగర్‌ను సునాయాసంగా దాటేసింది. ఈ చారిత్రాత్మక విజయానికి ప్రధానంగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై పెరిగిన ప్రజా వ్యతిరేకతే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పదేళ్ల పాలనలో నిరుద్యోగం పెరగడం, జీవన వ్యయం భారమవ్వడం మరియు ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో

**దశాబ్ద కాలం తర్వాత యూడీఎఫ్ జైత్రయాత్ర.. ఎల్‌డీఎఫ్ కోటలో అధికార మార్పిడి!**

జాప్యం వంటి అంశాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని నింపాయి. దీనిని గమనించిన యూడీఎఫ్, 'మార్పు కావాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి సఫలమైంది. వీటికి తోడు గోల్డ్ స్మగ్లింగ్ కేసు, శబరిమల వంటి వివాదాలు ప్రభుత్వంపై వ్యతిరేకతను మరింత పెంచగా, ధరల పెరుగుదల మరియు వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలను ప్రతిపక్షం సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ మేనిఫెస్టోలోని హామీలు గేమ్ ఛేంజర్‌గా మారాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.3,000 పెన్షన్, ఆరోగ్య బీమా వంటి పథకాలు మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించాయి. మహిళల

ఓటింగ్ శాతం రికార్డు స్థాయిలో 80.86 శాతంగా నమోదు కావడం యూడీఎఫ్‌కు కలిసి వచ్చింది. దీనికి తోడు ముస్లిం లీగ్ భాగస్వామ్యంతో కూడిన మైనారిటీ ఓట్ల ఏకీకరణ, రాహుల్ గాంధీ విస్తృత ప్రచారం కూటమికి తిరుగులేని విజయాన్ని అందించాయి. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను బీజేపీ కొంత చీల్చినప్పటికీ, అంతిమంగా కేరళ ప్రజలు అభివృద్ధి మరియు సంక్షేమం వైపు మొగ్గు చూపుతూ హస్తం పార్టీకి అధికారాన్ని అప్పగించారు.

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

# కుక్కలతో జర భద్రం!

- చర్మవ్యాధులతో వీధుల్లో సంచరిస్తున్న శునకాలు
- భయాందోళనలో ప్రజలు..
- రేబిస్ ముప్పు పెరుగుతోందని వైద్యుల హెచ్చరిక
- నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం
- మాంసం వ్యర్థాలతో వ్యాధుల వ్యాప్తి
- కాటేస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగి స్వేచ్ఛగా సంచరిస్తుండటం ప్రజల్లో భయాందోళన కలిగిస్తోంది. రోడ్లపై అకస్మాత్తుగా పరిగెత్తుతూ వాహనదారులకు ప్రమాదాలను కలిగిస్తున్నాయి. పలు పట్టణాల్లో కుక్కలు మనుషులను చూసి దాడి స్వభావంతో ప్రవర్తిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంటికొక పెంపుడు కుక్క పెంచుకోవడం ఫ్యాషన్‌గా మారినా, వీధి కుక్కల నియంత్రణ మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ముఖ్యంగా చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. శరీరమంతా మచ్చలు, దురదలతో ఉన్న ఈ కుక్కలు ఒకదానికొకటి వ్యాధిని వ్యాప్తి చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో కుక్కలు మనుషులకు కూడా వ్యాధులు సోకించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చర్మవ్యాధితో ఉన్న కుక్క కరిస్తే రేబిస్ ముప్పు ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల కుక్క కరిచిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన టీకాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మాంసం దుకాణాల వద్ద పడేసే వ్యర్థాలను తినడం వల్లే ఈ కుక్కల్లో వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కుక్కలను రెచ్చగొట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# డాక్టర్ అనితా రెడ్డికి 'ఉత్తమ మాతృమూర్తి' అవార్డు

- మదర్స్ డే వేడుకల్లో భాగంగా ఘన సన్మానం

**వేద న్యూస్, హనుమకొండ:**

అంజలీ మీడియా గ్రూప్స్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మదర్స్ డే "మాతృ శక్తి మహోత్సవం" కార్యక్రమంలో అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డికి 'ఉత్తమ కాకతీయ మాతృమూర్తి' అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. గత 30 సంవత్సరాలుగా సమాజానికి, అనాథలకు, దివ్యాంగులకు, మహిళలకు, వృద్ధులకు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా మహిళా సాధికారతకు కృషి చేస్తూ అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఆమెను సత్కరించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. తన సేవలకు లభించిన ఈ గౌరవం ఆనందంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతగా, అతిథిగా ఒకే వేదికపై నిలవడం గర్వకారణమని తెలిపారు. మాతృమూర్తులను సన్మానించడం అంటే సృష్టిని గౌరవించినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో కామిశెట్టి రాజు పటేల్, విజయలక్ష్మి, సరళ, విష్ణు, సిరాజుద్దిన్, శ్రీమన్నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమం స్థలంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

- సోమిడి గ్రామంలో 20 గుంటల భూమి కేటాయింపు
- రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం
- త్వరలో వృద్ధాశ్రమ నిర్మాణం ప్రారంభం
- పర్యావరణ పరిరక్షణకు మొక్కలే మార్గం: ఎమ్మెల్యే

**వేద న్యూస్, హనుమకొండ :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ మరియు జిల్లా సంక్షేమ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించనున్న వృద్ధాశ్రమం కోసం కాజీపేట్ మండలం సోమిడి గ్రామంలో 20 గుంటల భూమిని జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఈ భూమి కేటాయింపుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి సహకారం అందించారు. ఈ స్థలంలో సోమవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో మొక్కల నాటకం కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ స్థలంలో త్వరలోనే భవన నిర్మాణం చేపట్టి వృద్ధాశ్రమాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి మరియు పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. త్వరలోనే వృద్ధాశ్రమం ప్రారంభ మవుతుందని తెలిపారు. ఈ వృద్ధాశ్రమం కోసం భూమి కేటాయించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా

## ట్రాన్స్‌జెండర్ ఓరుగంటి స్నేహ

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధి ఓరుగంటి స్నేహ ను జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమించడం విశేషంగా నిలిచింది. ఈ నిర్ణయం పట్ల ట్రాన్స్‌జెండర్ సమాజం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, సలహాదారు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు మాట్లాడుతూ, ఈ నియామకానికి సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం ద్వారా ట్రాన్స్‌జెండర్ సమాజానికి రాజకీయంగా గుర్తింపు లభించడమే కాకుండా, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాల పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధత స్పష్టమవుతుందని వారు పేర్కొన్నారు.

# రుద్రూర్‌లో చలివేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, రుద్రూర్ :**

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండల సమయంలో ప్రయాణికులు, స్థానికులు చలివేంద్రాన్ని వినియోగించుకొని దాహాన్ని తీర్చుకోవాలని సూచించారు. ప్రజల సేవే ప్రధాన లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, ఎపిఓ అరవింద్, వార్డు సభ్యులు అమంద్ వెంకటేశ్వర్, రవి, వడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై ధాన్యం ఆరబోయొద్దు

- అలా చేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

**వేద న్యూస్, పాపన్నపేట :**

మండలంలో రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఎల్లపూర్, మిన్‌పూర్, యూసుఫ్‌పేట, కొత్తపల్లి గ్రామాల శివార్లలోని మెదక్–బొడ్మట్‌పల్లి రహదారిపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. ధాన్యం కుప్పల పక్కన రాళ్లు, కర్రలు పెట్టడం వల్ల రాత్రివేళ అవి కనిపించక ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు. రహదారులపై ధాన్యం కారణంగా ప్రమాదాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని, రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్కానిస్టేబుల్ అంజయ్య, కానిస్టేబుళ్లు ప్రవీణ్, వసంత్, మధులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు పూడిక తీత పనుల పరిశీలన

**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ గ్రామ శివారులోని చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను సోమవారం అధికారులు పరిశీలించారు. తహసిల్దార్ తారాబాయి ఆధ్వర్యంలో ఆర్ఐ రాజేష్, డిప్యూటీ తహసిల్దార్ సురేందర్ నాయక్, ఇరిగేషన్ డిఈఈ మహమ్మద్ రఫీ, ఇరిగేషన్ ఏఈ శృతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చెరువులో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే పూడిక తీత పనులు నిర్వహించాలని సూచించారు.

# డీపీవోపై చర్యలు తీసుకోవాలి

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మేకల అక్షయ్ కుమార్

**వేద న్యూస్, జగిత్యాల :**

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మేకల అక్షయ్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామపంచాయతీలో నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ అంశంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ జిల్లా పంచాయతీ అధికారి సరైన విచారణ చేపట్టలేదని ఆరోపించారు. గ్రామంలో చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపులు, రికార్డులను పరిశీలించకపోవడం పట్ల ఆక్షేపించారు. అనేక ఫిర్యాదులపై స్పందించకుండా కాలయాపన చేయడం ద్వారా అవినీతి, అక్రమాలకు పరోక్షంగా ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. కాబట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

# మహిళా టైలర్లందరికీ కుట్టుమిషన్లు అందించాలి

## - వినతి పత్రం అందజేసిన ఏఐటీయూసీ అనుబంధ సంఘం

**వేద న్యూస్, నల్లబెల్లి :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టుమిషన్ల పంపిణీకి తీసుకున్న నిర్ణయాన్ని విస్తరించాలని ఏఐటీయూసీ అనుబంధ చేతి వృత్తిదారుల సంఘం కోరింది. ఈ మేరకు నల్లబెల్లి ఎంపీడీవో కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ పథకాన్ని కేవలం వెయ్యి మందికే పరిమితం చేయకుండా అర్హులైన మహిళా టైలర్లందరికీ వర్తింపజేయాలని కోరారు. శిక్షణ సర్టిఫికెట్లు ఉన్నవారితో పాటు ప్రస్తుతం వృత్తిలో కొనసాగుతున్న టైలర్లను కూడా పథకంలో చేర్చాలని సూచించారు. అలాగే కుట్టు సామగ్రి కొనుగోలు కోసం బ్యాంకుల ద్వారా లక్ష రూపాయల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టేందుకు నిర్ణయించిన ధరలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేవని, చిన్న పిల్లల దుస్తులకు రూ.100, 10 ఏళ్లు పైబడిన వారికి రూ.200 చెల్లించాలని కోరారు. ఈ వినతిపత్రం సమర్పణలో సంఘం గౌరవ అధ్యక్షురాలు ఓదెల కవిత, అధ్యక్షురాలు కత్తి రమ, కార్యదర్శి దిండు మమత పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఉచిత కుట్టుమిషన్ల నిర్ణయాన్ని అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న టైలర్ల సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, ఏఐటీయూసీ నాయకులు ఓదెల రవి, కందిక రమేష్, ఎంఆర్పీఎస్ నాయకులు మరియు పలువురు మహిళా టైలర్లు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ
## - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వినతులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలా చేయడం ద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా పెరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వేగంగా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి

## - పంట మార్పిడి విధానం అవలంబించాలి
## - ఘనంగా రైతు వారోత్సవాలు

**వేద న్యూస్, శాయంపేట :**

ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గట్లకనిపర్తి రైతు వేదికలో రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు కలిసి పాల్గొన్నారు. ఘట్లకనిపర్తి ఏఈఓ రాకేష్, శాయంపేట ఏఈవో జ్యోష్న, నేరెడుపల్లి ఏఈవో సానియా మరియు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, నమూనాల సేకరణ విధానం గురించి వివరించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి సేకరించిన భూసార నమూనాల ఆధారంగా సోయిల్ హెల్త్ కార్డులు కొంతమంది రైతులకు పంపిణీ చేశారు. రాబోయే వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ప్రభుత్వం సూచించిన సన్నాలు బోనస్ పథకం కోసం రైతులు మెరుగైన వరి రకాలను సాగు చేయాలని సూచించారు. అలాగే వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని కొప్పుల గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. టి. జయ మాట్లాడుతూ భూసార పరీక్షలు ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలని, దానికి అనుగుణంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. నేల సారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై వివరించారు. పంట మార్పిడి విధానంలో పప్పుదినుసులు, ఉద్యాన పంటలను కలిపి సాగు చేస్తే సంవత్సరం పొడవునా ఆదాయం పొందవచ్చని చెప్పారు. తరువాత వ్యవసాయ కళాశాల సహాయ ప్రొఫెసర్ డా. ఎస్. వంశీ కృష్ణ ఉద్యాన పంటల సాగు విధానం, ఆయిల్ పామ్ ప్రాముఖ్యత, సస్యరక్షణ పద్ధతులపై వివరించారు. శాయంపేట మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని మాట్లాడుతూ, రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకొని నేల ఆరోగ్యం కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జి. అన్వేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు జి. భవాని, ఎం. భవాని, కొప్పుల గ్రామ సర్పంచ్ మామిడి అశోక్ మరియు రైతులు పాల్గొన్నారు.

# నేల పరిరక్షణే లక్ష్యంగా సాగాలి

## - సేంద్రియ పద్ధతులతో స్థిరమైన వ్యవసాయం
## - రైతులకు శాస్త్రవేత్తల పిలుపు

**వేద న్యూస్, నల్లబెల్లి:**

మండలంలోని రైతు వేదికలు సోమవారం సందడిగా మారాయి. 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలు నల్లబెల్లి, నారక్కపేట, కన్నారావుపేట, ముచ్చింపుల, మేడిపల్లి గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, సేకరించిన నమూనాల ఆధారంగా రూపొందించిన భూసార పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేశారు. నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని మండల వ్యవసాయ అధికారి బి. రజిత తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో నేల పరిరక్షణపై ప్రమాణం చేయించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, భూసారాన్ని పెంపొందించే విధానాలను అవలంబించాలని సూచించారు. రాబోయే వానాకాలం దృష్ట్యా సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వరి రకాలపై రైతులను ప్రోత్సహించారు. అలాగే ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆయిల్ పామ్ సాగులో ఉన్న లాభాలను వివరించి రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. విత్తన శుద్ధి నుంచి ఎరువుల వినియోగం వరకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు విశ్వ భాను, శివ, శ్రీకాంత్, మహేందర్, వినూష తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు, అభ్యుదయ కర్షకులు పాల్గొన్నారు.

# రసాయన వినియోగాన్ని తగ్గించాలి

## - శాస్త్రీయ సాగుతో ఖర్చు తగ్గింపు
## - సేంద్రియ విధానాలపై దృష్టి పెట్టాలి

**వేద న్యూస్, నల్లబెల్లి :**

రైతులు అధిక రసాయనాల వినియోగాన్ని తగ్గించి, శాస్త్రీయ పద్ధతులతో సాగు ఖర్చును తగ్గించుకోవాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. శ్రావణ్ కుమార్ సూచించారు. సోమవారం నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని కాపాడడంలో రైతులే కీలక పాత్ర పోషించాలని తెలిపారు. అవసరానికి మించి యూరియా వినియోగం వల్ల సాగు ఖర్చులు పెరగడమే కాకుండా భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. ఒకే పంటను పదే పదే సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని వివరించారు. రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని, అందుబాటులో ఉన్న సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బయోటెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ వై. హరి ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలు, వాటి దిగుబడి సామర్థ్యం గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి రజిత బన్న మాట్లాడుతూ, ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై రైతులను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ శోభన, పంచాయతీ కార్యదర్శి విష్ణు, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# తూకంలో మోసం చేస్తున్నారని...

## - రైతుల భారీ ధర్నా.. నిలిచిపోయిన రాకపోకలు
## - లారీల కొరతపైనా ఆగ్రహం

**వేద న్యూస్, గంభీరావుపేట:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ గంభీరావుపేట మండలం దమ్మన్నపేట, నాగంపేట గ్రామాల రైతులు పెద్దమ్మ స్టేజి వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు ఉండాల్సినదానికంటే అధిక తూకం వేస్తున్నారని ఆరోపించారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో తూకం పేరుతో నిలువు దోపిడీ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, ధాన్యం బస్తాలు సిద్ధంగా ఉన్నప్పటికీ లారీలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల్లోనే నిల్వలు పేరుకుపోతున్నాయని తెలిపారు. వర్షాలు పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న తహసిల్దార్ మారుతి రెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. లారీల కొరతను వెంటనే తీర్చడంతో పాటు తూకంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

# ఎండదెబ్బతో యువకుడు మృతి

## - కుటుంబంలో తీవ్ర విషాదం

**వేద న్యూస్, మందమర్రి:**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని శాంతినగర్ గ్యారేజ్ లైన్‌కు చెందిన బండవరం ప్రశాంత్ (30) ఎండదెబ్బ తగలడంతో సోమవారం ఇంట్లోనే మృతి చెందాడు. మృతుడు ప్రశాంత్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. పిల్లలు చిన్నవారే కావడంతో ఈ ఘటన స్థానికులను కలిచివేసింది. ఆయన మందమర్రి మండలం మామిడిగుడెం అంజనేయ స్వామి ఆలయంలో పూజారిగా సేవలందిస్తున్నారు. ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల ప్రభావంతో ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# విధులకు గైర్హాజరు..

- రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్
- మెమోలు ఇచ్చినా
- స్పందించని వైనం
- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు

**వేద న్యూస్, పెద్దపల్లి :**

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ పైఅధికారుల ఆదేశాలను పట్టించుకోని కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ కె. చిరంజీవి ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం, చిరంజీవి విధులకు సక్రమంగా హాజరుకాకపోవడమే కాకుండా ఉన్నతాధికారుల ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం గమనించబడింది. వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను కూడా స్వీకరించకపోవడంతో క్రమశిక్షణారాహిత్యం స్పష్టమైందని పేర్కొన్నారు. కమాన్‌పూర్ తహసీల్దార్ సమర్పించిన నివేదిక ఆధారంగా శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసి, సంబంధిత నిబంధనల ప్రకారం సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# అనధికారిక కూరగాయల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు మార్కెట్ కమిటీ విజ్ఞప్తి

**వేద న్యూస్, కాజీపేట :**

హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని చౌరస్తా వద్ద మెయిన్ రోడ్డుపై అనధికారికంగా కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాచ్ పేయి కు వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. రెండు నెలల క్రితం ఇచ్చిన అర్జీపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. రోజురోజుకు రోడ్డుకు ఇరువైపులా కూరగాయల విక్రేతల సంఖ్య పెరుగుతోందని, దీంతో మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కింది స్థాయి అధికారులు కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 14వ తేదీ నుండి రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు జాప్యం

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు

**వేద న్యూస్, హుస్నాబాద్:**

మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు ఎండలో నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు తెలిపారు. నాయకులతో కలిసి మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం, గన్ని బ్యాగుల కొరత, తూకంలో తగ్గింపుల వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వడ్లు, మక్కల కొనుగోలు వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# వైభవంగా ముగిసిన మత్స్యగిరి బ్రహ్మోత్సవాలు

**వేద న్యూస్, శాయంపేట :**

మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీ మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. గత నెల 29 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు కన్నుల పండువగా సాగి, ఆదివారం రాత్రి నాగవల్లి కార్యక్రమంతో ముగింపు పొందాయి. ఈ సందర్భంగా అర్చకులు విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, ద్వాదశ ఆరాధనలు, పుష్పయాగం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మత్స్యగిరి స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు. మచ్చర్లయ్య గుట్టకు భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి పండితులను సన్మానించి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, కుసుమ వెంకటకృష్ణ, సామల రవీందర్ తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- పలు కొనుగోలు కేంద్రాల పరిశీలన

**వేద న్యూస్, మందమర్రి :**

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం మద్దతు ధరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని, రైతులు కూడా ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. రైతుల వివరాలను సిస్టంలో నమోదు చేసి, ఆధార్ ద్వారా గుర్తింపును ధృవీకరించాలని, భూమి విస్తీర్ణం, పంట వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదని నిర్ధారించి కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రత

- గంభీరావుపేటలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

**వేద న్యూస్, గంభీరావుపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రుల బృందం పర్యటన సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్‌తో పాటు ఇతర ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, ఎస్ఐ అనిల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగ బాలికకు అందని న్యాయం

- మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు బేఖాతరు
- నాలుగేళ్లుగా అమలుకాని నిర్ణయాలు
- అధికారుల నిర్లక్ష్యంపై తండ్రి ఆవేదన
- వైద్యం, ఇల్లు ఇప్పటికీ అందని వైనం
- ఆదుకోవాలని విజ్ఞప్తి

**వేద న్యూస్, కరీంనగర్ :**

బాధితులకు బాసటగా నిలవాల్సిన మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. తన దివ్యాంగ కుమార్తెకు న్యాయం చేయాలని కమిషన్ ఆదేశించి నాలుగేళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు లేకపోవడంపై బాధితురాలి తండ్రి షేక్ మునవర్ పాషా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ అహ్మద్‌పూర్‌కు చెందిన మునవర్ పాషా పెద్ద కుమార్తె అతిఫా మెహరీన్ పుట్టుకతోనే మానసిక, శారీరక వికలాంగురాలు. కుమార్తె సంక్షేమం, వైద్య సహాయం కోసం ఆయన 2020 ఫిబ్రవరి 25న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన కమిషన్ మరుసటి రోజే బాలికకు అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు డబుల్ బెడ్రూమ్ ఇల్లు కేటాయించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే కమిషన్ ఆదేశాలు వెలువడిన నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటివరకు ఒక్కటీ అమలు కాలేదని మునవర్ పాషా వాపోతున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన లేకపోవడం బాధాకరమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ ప్రయోజనాలు అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి మానవ హక్కుల కమిషన్ ఆదేశాలను అమలు చేసి తన కుమార్తెకు న్యాయం చేయాలని, అవసరమైన వైద్య సహాయం, నివాస సౌకర్యం కల్పించాలని ఆయన వేడుకుంటున్నారు.

# నేల సంరక్షణలో ఎరువుల వినియోగం కీలకం

- భూసార పరీక్షలు చేయించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, తంగళ్లపల్లి :**

సాగులో నేలల సంరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాల సందర్భంగా తంగళ్ల పల్లి మండలం తాడూరు గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి రైతు తప్పనిసరిగా నేల నమూనాలు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. భూసార వివరాల ఆధారంగా ఎరువుల వినియోగం, పంటల ఎంపిక చేస్తే దిగుబడులు మెరుగుపడతాయని చెప్పారు. అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల నేల నిస్సారం కావడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ పంట వైపు మళ్లాలని సూచించారు. అలాగే అధిక లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ సాగు చేయాలని, మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సేవలను వినియోగించుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం, జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్, డీపీఓ షర్ఫుద్దీన్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

# తడిచిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- అన్నదాతలు అధైర్యపడవద్దు
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి నాగరాజు

**వేద న్యూస్, ఖమ్మం :**

రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వందేనని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు అన్నారు. ఈసారి పంట దిగుబడి అధికంగా రావడంతో కొనుగోలు ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు తీసుకొచ్చిన ధాన్యం, మొక్కజొన్నను కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. వర్షాలకు తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేస్తూ, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. అన్ని విధాలుగా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురు అరెస్ట్

- నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం.. కేసు నమోదు

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఎస్ఐ వెంకట్రాజం తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు, హన్మాజిపేట్ గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న రామ్ రెడ్డి, దేవయ్య, సతీష్, భూమయ్య, రణదీర్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.7,750 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, అసంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, గంజాయి వంటి అక్రమాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని తెలిపారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరుతూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

- అకాల వర్షాల దృష్ట్యా ప్రత్యేక చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. టార్పాలిన్ కవర్లు, తాగునీరు, షామియానాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. తేమ శాతం పరీక్షించే యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడా జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. హమాలీలు, వాహనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి కనీసం 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా అధికారులు గీత, రామకృష్ణ, బుచ్చిబాబు, నరసింహ, అఫ్జల్ బేగం, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు హాజరయ్యారు.

# మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి

- లక్షల్లో నష్టం.. రైతుల ఆవేదన

**వేద న్యూస్, వేములవాడ :**

వేములవాడ పట్టణ పరిధిలోని కొనయిపల్లి గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదం అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. చేతికొచ్చిన మొక్కజొన్న పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతులు గుండె కోతకు గురయ్యారు. గ్రామ సమీపంలోని పొలాల్లో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి, ఎండిపోయిన పంటతో పాటు గాలి వేగం కారణంగా క్షణాల్లో ఎకరాల మేర వ్యాపించాయి. మంటలను గమనించిన రైతులు వాటిని ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అదుపులోకి తేవడం సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎకరాల కొద్దీ మొక్కజొన్న పంట దగ్ధమై రైతులకు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే దశలోనే ఇలా కాలిపోవడంతో బాధిత రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# డాక్టర్ బండి కుమార్‌కు నంది అవార్డు

- హైదరాబాద్‌లో ఘనంగా అవార్డు ప్రదానం

**వేద న్యూస్, ఖమ్మం :**

ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కు నంది అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో మొగిలి, ఎన్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాబు మోహన్, తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ప్రముఖులు యిమ్మడి రమేష్, వంశీ రామరాజు, డాక్టర్ కవి యాకూబ్ తదితరులు పాల్గొని అవార్డును అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం డాక్టర్ బండి కుమార్ మాట్లాడుతూ, తన జర్నలిజం సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

- డివిజన్ స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 220 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# జ్యూవెలరీ షాప్ సందర్శించిన ఎమ్మెల్యేలు

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యూవెలరీ షాప్‌లో గుర్తు తెలియని దుండగులు చొరబడి కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. నిందితులను త్వరితగతిన గుర్తించి కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై విచారం వ్యక్తం చేసిన నేతలు గాయపడిన బాధితులను ఆసుపత్రిలో పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ వంటి పట్టణంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొంటూ, ప్రజలు భయాందోళన చెందకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలోని రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయం, భూసార సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి సాయి కృప మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నాణ్యమైన సన్న వరి రకాలపై రైతులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి ప్రయోజనాలను తెలియజేశారు. సన్న రకాలు తక్కువ నీటితో మంచి దిగుబడి ఇస్తాయని సూచించారు. వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడబడుతుందని, ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. అధిక ఎరువుల వినియోగం వల్ల భూమి సారం తగ్గి చీడపీడలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట మార్పిడి విధానం పాటించడం ద్వారా నేల సారం పెరిగి 15-20 శాతం వరకు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి కోయ్యలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని, మిత్ర పురుగులు నశిస్తాయని పేర్కొన్నారు. అవి పొలంలో కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి దిగుబడులు పెరుగుతాయని వివరించారు. అలాగే రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి, భూసారానికి అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ మహేష్, రైతులు దోమకొండ చిన్న రాజన్న, జంగా విజయ్, పెద్ద లింగారెడ్డి, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

## ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగు

– సర్పంచ్ పావని నరేందర్ గౌడ్

**వేద న్యూస్, పాపన్నపేట:**

ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరం లాంటిదని గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేటలో అచ్చుకట్ల రాణి రమేష్ నూతన గృహాన్ని ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల ద్వారా నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడం వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో విష్ణువర్ధన్, హౌసింగ్ ఏఈ అరుణ్ ప్రసాద్ గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ సద్దామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ విజయోత్సవ సంబరాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**

పుదుచ్చేరి, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ వద్ద పార్టీ శ్రేణులు సోమవారం రాత్రి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మిఠాయిలు పంచుతూ, టపాకాయలు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, కటికే రామ్ రాజ్, పార్వతి మురళి, ఎముల గజేందర్, కృష్ణంరాజు, కళ్యాణి, బెజగం వెంకటేష్, బోజకొండ అనిల్, గాయాక్వాడ్ అనిల్, సతీష్ గౌడ్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్‌లో అక్రమాలపై విచారణ జరపాలి

- ఖమ్మం కలెక్టర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి
- పారదర్శకత పాటించాలని జర్నలిస్టుల డిమాండ్

**వేద న్యూస్, ఖమ్మం :**

ఖమ్మం జిల్లాలో మీడియా అక్రిడిటేషన్ కమిటీ నియామకం, కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ కు వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ నేతృత్వంలోని బృందం కలెక్టర్‌ను కలిసి, అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని పేర్కొన్నారు. కమిటీ నియామకంలో అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా ఒకే యూనియన్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో కూడా నిబంధనలు పాటించలేదని, అనర్హులైన అభ్యర్థులకు అక్రిడిటేషన్ మంజూరు చేస్తున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పక్కనపెట్టి వెరిఫికేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. ఈ పరిణామాల వల్ల నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, మొత్తం ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించిన దరఖాస్తులను పునఃపరిశీలించాలని కోరారు. భవిష్యత్తులో అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేములకొండ రమేష్, కందరబోయిన నాగకృష్ణ, మామిడాల కిరణ్, కాసోజు శ్రీధర్, కరుణాకర్ సుదగాని, గంటేల కుమార్, ఎలుగోటి వెంకట్, చిన్నంశెట్టి రాంబాబు, అంతోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 11 ఫిర్యాదులు స్వీకరణ

- త్వరిత పరిష్కారానికి ఎస్పీ ఆదేశాలు
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ
- బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ
- చట్టబద్ధంగా వేగవంత చర్యలపై దృష్టి

**వేద న్యూస్ జోగుళాంబ గద్వాల :**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా వినిపించారు. ఈ సందర్భంగా మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ, బాధితుల సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే విచారణ ప్రారంభించి సత్వర పరిష్కారం కల్పించాలని ఆదేశించారు. ప్రతి కేసును చట్టబద్ధంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడం పోలీస్ శాఖకు ప్రాధాన్యమని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా పోలీసులను ఆశ్రయించాలని, పారదర్శకంగా, న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా వాణి కార్యక్రమం ద్వారా పోలీస్‌ప్రజా సంబంధాలు మెరుగుపడుతున్నాయని, సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలు కాపాడతామని స్పష్టం చేశారు.

# సుందర్ మెరుపు.. గుజరాత్ జోరు కొనసాగింపు

**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తోంది. వరుస విజయాలతో జట్టు ప్లే ఆఫ్స్ దిశగా బలంగా అడుగులు వేస్తోంది. తాజాగా పంజాబ్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో గెలుపొందిన గుజరాత్, పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో కీలక సమయంలో బాధ్యత తీసుకున్న వాషింగ్టన్ సుందర్ జట్టుకు విజయం అందించాడు. ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చిన అతడు కేవలం 23 బంతుల్లో 40 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. చివరి ఓవర్‌లో ఆత్మవిశ్వాసంతో సిక్సర్ బాది మ్యాచ్‌ను ముగించడంతో అతడి ఇన్నింగ్స్‌కు మరింత ప్రాధాన్యం లభించింది. గుజరాత్ టైటాన్స్ జట్టు టాపార్డర్‌పైనే ఆధారపడుతుందనే విమర్శలు గత కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లో సుందర్ తన అద్భుత ప్రదర్శనతో ఆ విమర్శలకు గట్టి సమాధానం ఇచ్చాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ మ్యాచ్‌ను విజయవంతంగా ముగించడం అతడి పరిపక్వతను చాటిచెప్పింది. టీమిండియా మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ కూడా సుందర్ ఆటతీరును ప్రశంసించాడు. కీలక సమయంలో బాధ్యత తీసుకుని జట్టును గెలిపించడం గొప్ప విషయం అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఇన్నింగ్స్‌లు జట్టు మేనేజ్‌మెంట్‌కు ఆటగాడిపై మరింత నమ్మకాన్ని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. మొత్తానికి, గుజరాత్ టైటాన్స్ సమష్టిగా రాణిస్తూ సీజన్‌లో బలమైన జట్టుగా అవతరిస్తోంది. రాబోయే మ్యాచ్‌ల్లో కూడా ఇదే జోరు కొనసాగితే ప్లే ఆఫ్స్ చేరుకోవడం పెద్ద విషయం కాదని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# టాప్ నాలుగు కోసం హోరాహోరీ పోటీ

**వేద న్యూస్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ క్రమంగా కీలక దశలోకి అడుగుపెడుతుండగా, పాయింట్ల పట్టికలో టాప్ నాలుగు స్థానాల కోసం జట్ల మధ్య పోటీ రోజురోజుకీ ఉత్కంఠభరితంగా మారుతోంది. ప్రతి మ్యాచ్ ఫలితం పట్టికను తారుమారు చేస్తుండటంతో ప్లే ఆఫ్స్ రేసు మరింత రసవత్తరంగా మారింది. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ, ఇటీవల ఎదురైన ఓటమితో వారి ఆధిక్యం గణనీయంగా తగ్గింది. అదే సమయంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు వరుస విజయాలతో అగ్రస్థానాన్ని లక్ష్యంగా చేసుకుని దూసుకెళుతున్నాయి. ఇంకొకవైపు గుజరాత్ టైటాన్స్ పరిస్థితి మరింత ఆసక్తికరంగా ఉంది. పాయింట్ల పరంగా మంచి స్థితిలో ఉన్నప్పటికీ, నెట్ రన్‌రేట్ ప్రభావంతో టాప్ నాలుగులో స్థానం దక్కకపోవడం విశేషం. అయితే ఇటీవలి విజయాలతో ఆ జట్టు మళ్లీ బలంగా పోటీలోకి రావడంతో ప్లే ఆఫ్స్ సమీకరణాలు క్లిష్టంగా మారాయి. ఇదే సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు కూడా వరుస విజయాలతో రేసులో నిలిచి పోటీని మరింత కఠినతరం చేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఈసారి ఏడు నుంచి ఎనిమిది జట్లు చివరి వరకు పోటీలో ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సీజన్ ప్రత్యేకతగా బ్యాటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ, కె.ఎల్. రాహుల్ వంటి ఆటగాళ్లు అద్భుత ఫామ్‌లో ఉండి పరుగుల వర్షం కురిపిస్తున్నారు. రెండు వందలకు పైగా జట్టు స్కోర్లు సర్వసాధారణంగా మారిపోవడం ఈ సీజన్‌కు కొత్త రంగు తీసుకువచ్చింది. అదే సమయంలో బౌలర్లకు సవాళ్లు పెరిగినప్పటికీ, భువనేశ్వర్ కుమార్, కాగిసో రబడా వంటి అనుభవజ్ఞులు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ తమ ప్రభావాన్ని చూపిస్తున్నారు. ప్రస్తుత ఫామ్, జట్ల సమతూకం, ఆటగాళ్ల ప్రదర్శనలను బట్టి చూస్తే పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి నాలుగు స్థానాల్లో నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఐపీఎల్ ప్రత్యేకతే అనూహ్య మలుపులు కావడంతో చివరి లీగ్ మ్యాచ్ వరకు ఈ పోటీ ఉత్కంఠగా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. అభిమానులు ప్రతి మ్యాచ్‌ను ఉత్కంఠతో ఆస్వాదిస్తుండగా, ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించే జట్లు ఎవరో అన్న ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది.

## ధోనీ ఎంట్రీపై ఇంకా అనిశ్చితి

**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోనీ ఇంకా మైదానంలోకి అడుగుపెట్టకపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నప్పటికీ అతడి ఎంట్రీపై ఎలాంటి స్పష్టత రాకపోవడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. చెన్నై జట్టును ఐదుసార్లు విజేతగా నిలిపిన ఎంఎస్ ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం విశేషం. ప్రారంభ మ్యాచ్‌ల సమయంలో జట్టుతో కలిసి ప్రయాణించినప్పటికీ, తుది జట్టులో మాత్రం అతడికి చోటు దక్కలేదు. ఇదే పరిస్థితి వరుసగా కొనసాగుతుండటంతో అభిమానుల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ధోనీ గైర్హాజరీకి ప్రధాన కారణంగా గాయమే కనిపిస్తోంది. కాలి పిక్క వద్ద గాయం కారణంగా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ అందుకోలేకపోయిన అతడు ప్రస్తుతం పునరావాస దశలో ఉన్నట్లు సమాచారం. వయస్సు కూడా ఒక ముఖ్యమైన అంశంగా మారడంతో శరీరాన్ని మళ్లీ మ్యాచ్ ఫిట్‌నెస్‌కు తీసుకురావడం అంత సులభం కాదని నిపుణులు భావిస్తున్నారు. దీంతో అతడి రీ-ఎంట్రీ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ముంబై జట్టుతో మ్యాచ్‌కు ముందు రోహిత్ శర్మను కలవడం అభిమానుల్లో ఆశలు రేకెత్తించింది. అయితే మ్యాచ్ సమయంలో మాత్రం అతడు మైదానంలో కనిపించకపోవడంతో ఆ ఆశలు నెరవేరలేదు. మరోవైపు జట్టు ఢిల్లీ మ్యాచ్ కోసం బయలుదేరినప్పటికీ ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి ఎంట్రీపై మరింత అనిశ్చితిని పెంచుతోంది.ధోనీ లేని పరిస్థితిలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును సమర్థంగా నడిపిస్తున్నాడు. ప్రారంభంలో కొంత తడబడినప్పటికీ ఇప్పుడు తన నాయకత్వంలో జట్టును క్రమంగా గెలుపు దిశగా తీసుకెళ్తున్నాడు. యువ ఆటగాళ్లు కూడా తమ తమ పాత్రల్లో రాణిస్తూ జట్టును ప్లే ఆఫ్స్ పోటీలో నిలబెట్టడం విశేషం.అయితే ధోనీ అనుభవం జట్టుకు ఎంత అవసరమో ప్రతి మ్యాచ్‌లో కనిపిస్తోంది. కీలక సమయాల్లో మ్యాచ్‌ను ముగించే అతడి సామర్థ్యం, వికెట్ల వెనుక నుంచి ఇచ్చే మార్గదర్శనం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే సీజన్ చివరి దశలో అయినా అతడు మైదానంలోకి దిగితే చెన్నై జట్టుకు అదనపు బలం చేకూరుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 05, 2026

# త్రిష లుక్‌తో పెరిగిన అంచనాలు

**వేద న్యూస్ డెస్క్:**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినీ ప్రపంచంలో భారీ చర్చకు దారి తీస్తోంది. నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ఈ చిత్రంపై అంచనాలను మరింత పెంచింది. పోస్టర్‌లో త్రిష సంప్రదాయ వేషధారణలో దివ్య కాంతులతో మెరిసిపోతూ కనిపించడం అభిమానులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ చిత్రంలో త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర కథకు కీలకంగా మారనుందని సమాచారం. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా ఈ పాత్ర నిలవనుంది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న ఈ పాత్రలో త్రిష తన నటనలో మరో కొత్త కోణాన్ని చూపించనుందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో ఆమె చేసిన పాత్రలతో పోలిస్తే, ఇది మరింత బలమైన మరియు ప్రభావవంతమైన పాత్రగా నిలుస్తుందని అంచనా. ఇటీవలి కాలంలో కథలకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న త్రిష కృష్ణన్‌కు 'విశ్వంభర' ఒక కీలక మలుపు కావచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా ఆమెకు దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక చిరంజీవిత్రిష కృష్ణన్ కలయిక ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా మారింది. గతంలో వీరిద్దరి మధ్య కనిపించిన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈసారి సోషియో ఫాంటసీ నేపథ్యంతో వారి పాత్రలు ఎలా ఉంటాయో అన్న ఆసక్తి మరింత పెరిగింది. ముఖ్యంగా చిరంజీవి పాత్రకు త్రిష పాత్ర ఎలా అనుసంధానమవుతుందో అనేది కథలో కీలకంగా ఉండనుందని సమాచారం. ఈ చిత్రాన్ని దర్శకుడు వశిష్ట అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. దృశ్య ప్రభావాలు, సాంకేతిక విలువల పరంగా హాలీవుడ్ స్థాయిలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఫాంటసీ, భావోద్వేగాల మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతుండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయ్యి, ప్రస్తుతం నిర్మాణానంతర పనులు వేగంగా సాగుతున్నాయి. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. సంగీతం, నేపథ్య సంగీతం, గ్రాఫిక్స్ అన్నీ ప్రత్యేకంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి, త్రిష లుక్ విడుదలతో 'విశ్వంభర'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అభిమానులు ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమలో మరో మైలురాయిగా నిలుస్తుందా లేదా అనేది చూడాలి.




## సుందర్ సి తప్పుకోవడానికి కారణం వెల్లడి

**వేద న్యూస్ డెస్క్:**

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, ఉలగనాయకుడు కమల్ హాసన్ నిర్మాతగా రూపొందనున్న భారీ చిత్ర ప్రాజెక్ట్ నుంచి దర్శకుడు సుందర్ సి తప్పుకోవడానికి గల అసలు కారణాన్ని వెల్లడించారు. ఈ ఇద్దరు దిగ్గజాలు దశాబ్దాల తర్వాత ఒకే ప్రాజెక్ట్ కోసం కలిసివస్తుండటంతో ఈ సినిమా ప్రకటన సినీ ప్రపంచంలో భారీ ఉత్కంఠను రేకెత్తించింది. అయితే మొదట ఈ చిత్రానికి దర్శకుడిగా ఎంపికైన సుందర్ సి అనూహ్యంగా ప్రాజెక్ట్ నుంచి వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ నిర్ణయంపై స్పందించిన సుందర్ సి, ఇది ఎంతో పెద్ద ప్రాజెక్ట్ కావడంతో ఆ స్థాయి ఒత్తిడిని తాను సమర్థంగా నిర్వహించలేనని భావించానని తెలిపారు. స్టార్ డైరెక్టర్‌గా ఉన్నప్పటికీ తన పరిమితులను బహిరంగంగా అంగీకరించడం సినీ వర్గాల్లో అరుదైన విషయంగా భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్తో కలిసి 'అరుణాచలం' వంటి భారీ విజయాన్ని అందించిన ఆయన, రజనీ ఇమేజ్‌ను బాగా అర్థం చేసుకున్న దర్శకుడిగా గుర్తింపు పొందారు. అయినప్పటికీ రజనీకమల్ లాంటి దిగ్గజాల కాంబినేషన్‌ను సమర్థంగా మలచడం చాలా క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇద్దరు అగ్ర నటుల అభిమానులను సంతృప్తి పరచడం, వారి ఇమేజ్‌లను సమతుల్యం చేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని వివరించారు. ప్రస్తుతం పాన్ ఇండియా ధోరణిలో ప్రతి అంశంపై భారీ అంచనాలు ఉంటాయని, చిన్న తప్పిదం జరిగినా సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు ఎదురవుతాయని తెలిపారు. అలాంటి ఒత్తిడి తన పనితీరుపై ప్రభావం చూపుతుందని ముందుగానే అంచనా వేసినట్లు చెప్పారు. రజనీకాంత్ యొక్క వాణిజ్య శైలి, కమల్ హాసన్ యొక్క సాంకేతిక ప్రమాణాలు ఈ రెండింటినీ ఒకేసారి సమన్వయం చేయడం పెద్ద సవాల్ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక పెద్ద అవకాశాన్ని స్వీకరించడం కంటే, దానికి న్యాయం చేయలేనని భావించినప్పుడు గౌరవంగా తప్పుకోవడమే మంచిదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని పలువురు సినీ విశ్లేషకులు వృత్తిపరమైన నిజాయితీగా అభినందిస్తున్నారు. మొత్తానికి ఈ ప్రాజెక్ట్ నుంచి సుందర్ సి తప్పుకోవడం ఒక సాహసోపేత నిర్ణయంగా నిలిచింది. అగ్ర హీరోలతో సినిమా అంటే అది కేవలం అవకాశం మాత్రమే కాకుండా భారీ బాధ్యత కూడా అని ఆయన తన నిర్ణయంతో స్పష్టంగా తెలియజేశారు.

## 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల

**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అప్‌డేట్ అధికారికంగా వెలువడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ నేపథ్య యాక్షన్ డ్రామా 'పెద్ది' విడుదల తేదీ ఖరారైంది. పలుమార్లు వాయిదా పడిన ఈ భారీ పాన్ ఇండియా చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో నిర్మాణ సంస్థ విడుదలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. ముఖ్యంగా విదేశీ మార్కెట్‌పై మేకర్స్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉత్తర అమెరికా ప్రాంతంలో ఈ చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ తొలి ప్రదర్శనను భారత కాలమానం ప్రకారం జూన్ 3 రాత్రి 9 గంటలకు ప్లాన్ చేశారు. దీంతో విదేశాల్లో ఉన్న తెలుగు ప్రేక్షకులు ముందుగానే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. అమెరికా మార్కెట్‌లో ఈ సినిమా ఓపెనింగ్స్ విషయంలో కొత్త రికార్డులు సృష్టించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక టికెట్ బుకింగ్స్ విషయానికి వస్తే, మే 7 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. రామ్ చరణ్కు ఉన్న అంతర్జాతీయ క్రేజ్ దృష్ట్యా తొలి ప్రదర్శనలకే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రీమియర్ షోలు, తొలి రోజు వసూళ్లు భారీ స్థాయిలో నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.సినిమా ప్రచార కార్యక్రమాల విషయంలో కూడా మేకర్స్ దూకుడు పెంచుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ట్రైలర్‌ను మే 17 లేదా 18న విడుదల చేసే అవకాశం ఉంది. ట్రైలర్ విడుదలతో సినిమా హైప్ మరింత పెరగనుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా, విదేశాల్లో భారీ ప్రమోషన్స్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఈ చిత్రంలో కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తుండగా, కీలక పాత్రల్లో శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి ప్రముఖులు కనిపించనున్నారు. ఈ భారీ తారాగణం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండేలా కథను రూపొందించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన బలం. ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఆల్బమ్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. స్పోర్ట్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో భావోద్వేగాలు, యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ సమతుల్యంగా మేళవించి ప్రేక్షకులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించేలా రూపుదిద్దుతోంది.ఇక సాంకేతిక పరంగా కూడా 'పెద్ది' అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కుతున్నట్లు సమాచారం. యాక్షన్ సన్నివేశాలు, క్రీడా నేపథ్య దృశ్యాలు, భావోద్వేగ ఘట్టాలు అన్నీ భారీ స్థాయిలో చిత్రీకరించబడ్డాయని తెలిసింది. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉండనున్నాయని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.మొత్తానికి, 'పెద్ది' విడుదలపై స్పష్టత రావడంతో అభిమానుల్లో ఆనందం నెలకొంది. జూన్ 4న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలన విజయాన్ని నమోదు చేస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది చూడాలి.

# 'కల్కి 2' షూట్‌పై తాజా వార్తలు

**వేద న్యూస్ డెస్క్:**

సైన్స్ ఫిక్షన్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులతో పాటు ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'కల్కి 2898 ఎడి' సీక్వెల్‌కు సంబంధించిన తాజా సమాచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే తొలి భాగంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా రూపొందుతున్న రెండో భాగం ఎప్పుడు ప్రారంభమవుతుందా అన్న ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో, ఇటీవల అమితాబ్ బచ్చన్ చిత్రీకరణలో పాల్గొన్నారన్న వార్తలు వినిపించాయి. ఇప్పుడు మరో ఆసక్తికర సమాచారం వెలువడింది. ప్రభాస్ కూడా ఈ సీక్వెల్ షూటింగ్‌లో చేరినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో జరిగే చిత్రీకరణల్లో ఆయన పాల్గొననున్నట్లు సమాచారం. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్ కొనసాగనున్నట్లు వినికిడి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఇక తొలి భాగంలో దీపికా పదుకొణె పోషించిన 'సుమతి' పాత్రకు సీక్వెల్‌లో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది. అలాగే కమల్ హాసన్తో పాటు పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించే అవకాశం ఉందని సమాచారం.భారీ దృశ్య వైభవంతో రూపొందిన 'కల్కి 2898 ఎడి' చిత్రంలో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ ప్రధాన పాత్రల్లో నటించగా, ప్రపంచవ్యాప్తంగా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ప్రత్యేక దృశ్య ప్రభావాలు, విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సీక్వెల్‌ను కూడా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించనున్నాడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం పై అంచనాలు భారీగా ఉన్నాయి. అధికారికంగా షూటింగ్ అప్‌డేట్స్ వెలువడితే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## సాయి పల్లవి బాలీవుడ్ ఆరంగేట్రం నిరాశ

**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో తన నటన, నృత్యాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన సాయి పల్లవి బాలీవుడ్‌లో చేసిన తొలి ప్రయత్నం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఆమె నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1న విడుదలై బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా పరిచయం కావడం, అదే సమయంలో ఆమిర్ ఖాన్ నిర్మాణ బాధ్యతలు చేపట్టడం వంటి అంశాలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే విడుదలైన తొలి రోజే మిశ్రమ స్పందన రావడంతో వసూళ్లు ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు. ట్రేడ్ వర్గాల ప్రకారం మొదటి రోజు దేశవ్యాప్తంగా ఈ చిత్రం సుమారు ఒక కోటి ముప్పై ఏడు లక్షల రూపాయల నికర వసూళ్లు సాధించగా, రెండో రోజు అది దాదాపు ఒక కోటి రూపాయల వద్దే ఆగిపోయింది. రెండు రోజుల్లో కలిపి సుమారు రెండు కోట్ల పదిహేను లక్షల నికర వసూళ్లు మాత్రమే వచ్చాయి. విదేశీ మార్కెట్‌లో కూడా పరిస్థితి మెరుగ్గా లేకపోయింది. రెండు రోజుల్లో కేవలం ఇరవై ఐదు లక్షల రూపాయల వసూళ్లు మాత్రమే నమోదవడంతో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రెండు కోట్ల ఎనభై రెండు లక్షల రూపాయల స్థాయిలోనే నిలిచిపోయాయి. భారీ అంచనాలతో వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం తీవ్రంగా వెనుకబడిన పరిస్థితిలో ఉందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ చిత్రం థాయ్ భాషా చిత్రం 'వన్ డే' ఆధారంగా రూపొందిన ప్రేమకథ. కథ ప్రకారం, ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన సహోద్యోగిపై ప్రేమ పెంచుకున్నప్పటికీ చెప్పలేకపోతాడు. ఒక సందర్భంలో ఆమెకు తాత్కాలిక జ్ఞాపకశక్తి కోల్పోయే సమస్య రావడంతో, ఆ పరిస్థితిని తన ప్రేమకు అనుకూలంగా మార్చుకోవాలనే ప్రయత్నమే కథకు ప్రధానాంశంగా ఉంటుంది.

## బ్రేకప్‌పై అనన్య మనసు విప్పింది

**వేద న్యూస్ డెస్క్:**

యువతలో మంచి గుర్తింపు పొందిన బాలీవుడ్ నటి అనన్య పాండే తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. ప్రేమలో ఎదురైన నిరాశలు, బ్రేకప్ అనుభవాల గురించి తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తన మనసులోని భావాలను వెలిబుచ్చింది. ప్రేమలో విఫలమైనప్పుడు తాను కూడా సాధారణ వ్యక్తిలానే బాధపడతానని ఆమె తెలిపింది. "అలాంటి సమయంలో నేను ఏడుస్తాను, ఐస్ క్రీమ్ తింటాను, అరిజిత్ సింగ్ పాడిన విషాద గీతాలు వింటాను. కొంతసేపటికి ఆ బాధను మెల్లగా మర్చిపోతాను" అంటూ సరదాగా చెప్పింది. బ్రేకప్ బాధ అనేది ప్రతి ఒక్కరికీ సహజమని, దానిని అంగీకరించడమే ముందడుగు అని ఆమె అభిప్రాయపడింది. గత సంబంధాల గురించి మాట్లాడిన అనన్య పాండే, అప్పట్లో ఎదుటివారి కోసం తాను తనను తాను తగ్గించుకునేదాన్నని చెప్పింది. "వాళ్లకు నచ్చేలా నేను మారిపోయేదాన్ని. కానీ మన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం సరైంది కాదని ఇప్పుడు అర్థమైంది" అని తెలిపింది. ఒంటరిగా జీవించడం ప్రారంభించిన తర్వాతే తనకు తనపై ప్రేమ పెరిగిందని, వ్యక్తిగత స్థలం ఎంత ముఖ్యమో తెలుసుకున్నానని ఆమె పేర్కొంది. గత అనుభవాలే తనను మరింత పరిపక్వత కలిగిన వ్యక్తిగా మార్చాయని చెప్పింది. ఇక ఆమె వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే, గతంలో నటుడు ఆదిత్య రాయ్ కపూర్తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మరో వ్యక్తితో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ విషయాలపై ఆమె నుంచి అధికారిక స్పందన రాలేదు. మొత్తానికి, తన అనుభవాలను నిజాయితీగా పంచుకున్న అనన్య పాండే మాటలు యువతలో మంచి చర్చకు దారి తీస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073